సాక్షి
కర్నూలు
మంగళవారం, 5, నవంబర్, 2024





### ఇలా 'ఐ'తే.. చూపు మాయం

కర్నూలు(హాస్పిటల్): ఖాళీ సమయం దొరికితే చాలు పిల్లలూ పెద్దలు తేడా లేదు.. మొబైల్ చేతిలో ఉండాల్సిందే. దీంతో చిన్నతనంలోనే దృష్టి లోపాలు ఎదుర్కొంటున్నారు.

8లో▸



### అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణకు సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఎం.దీపిక రూ.1,01,116, సికింద్రాబాద్‌కు చెందిన బంగరరావు రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



### టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | : 1,633 |
| ప్రస్తుతం | : 1,632 |
| సామర్థ్యం (టీఎంసీలు) | : 105.788 |
| ప్రస్తుతం | : 101.773 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 15,536 |
| అవుట్ ఫ్లో | : 15,116 |

## న్యూస్‌రీల్

### పది పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

కర్నూలు సిటీ: వచ్చే ఏడాది జరిగే పదవ తరగతి పరీక్షలకు ఫీజులు చెల్లించే గడువును పెంచినట్లు డీఈఓ శ్యామూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు ఈ నెల 11వ తేదీలోపు ఫీజు చెల్లింపు గడువు ఉండేదన్నారు. దీనిని ఈ నెల 18వ తేది వరకు పెంచారన్నారు. రూ.50 అపరాధ రుసుముతో 19 నుంచి 25వ తేదీలోపు, రూ.200 అపరాధ రుసుముతో 26 నుంచి వచ్చే నెల 3వ తేది వరకు, రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 4 నుంచి 10వ తేది వరకు గడువు ఉందని డీఈఓ వెల్లడించారు. రెగ్యులర్ అభ్యర్థులకు అన్ని సబ్జెక్టులకు రూ.125, 3 సబ్జెక్టులకుపైగా ఉంటే రూ.125, అంతకంటే తక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.110, వొకేషనల్ అభ్యర్థులకు అదనంగా రూ.60, తక్కువ వయస్సు కలిగిన అభ్యర్థులకు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం అవసరం అయితే రూ.80 ప్రకారం ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి సమాచారం కోసం www.bse.ap.gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని డీఈఓ వెల్లడించారు.

### 40 శాతం సబ్సిడీపై వేరుశనగ

- కర్నూలు జిల్లాకు 4,800, నంద్యాల జిల్లాకు 900 క్వింటాళ్లు కేటాయింపు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌కు సంబంధించి 40 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనం కాయలు సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కర్నూలు జిల్లాకు 4,800 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 900 క్వింటాళ్లు కేటాయించింది. కర్నూలు జిల్లాలోని ఆలూరు, ఎమ్మిగనూరు, ఆదోని నియోజక వర్గాల్లో వేరుశనగ సాగు చేస్తారు. నంద్యాల జిల్లాలో ప్రధానంగా డోన్ నియోజక వర్గంలో వేరుశనగ సాగు అవుతుంది. వేరుశనగ పూర్తి ధర కిలోకు రూ.96 నిర్ణయించింది. మార్కెట్‌లో నాణ్యమైన వేరుశనగ గరిష్ట ధర రూ.6000 నుంచి రూ.6500 వరకు లభిస్తోంది. ప్రభుత్వం మాత్రం ఏకంగా కిలో ధర రూ.96గా నిర్ణయించడం పట్ల రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 40 శాతం అంటే 38.40 ప్రకారం కిలోకు సబ్సిడీ లభిస్తుంది. సబ్సిడీ పోను రైతులు రూ.5760 చెల్లించాల్సి ఉంది.

### పోలీసుల అదుపులోనే హనుమంతు !

పత్తికొండ(తుగ్గలి): గ్రామంలో చిన్నపాటి గొడవ కేసుకు సంబంధించి అదుపులోకి తీసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శభాష్‌పురం మాజీ సర్పంచ్ హనుమంతు ఇంకా పోలీసుల అదుపులోనే ఉన్నారు. టీడీపీ కార్యకర్త కేసు పెట్టడంతో ఆదివారం సాయంత్రం ప్యాపిలి సమీపంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కర్నూలుకు తీసుకెళ్లారు. దాదాపు ఐదు గంటల పాటు రహస్య విచారణ పేరుతో వేధించి రాత్రి పది గంటల తర్వాత షరతులు విధించి వదిలిపెట్టారు. సోమవారం ఉదయం పత్తికొండకు సర్కిల్ కార్యాలయంలో హాజరై తిరిగి రాలేదు. గొడవ కేసుకు సంబంధించి హనుమంతుతో పాటు మరో ఆరుగురిపై జొన్నగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వీరిని రిమాండ్‌కు ఇవ్వనున్నట్లు సమాచారం. అక్రమ కేసులతో పోలీసుల ద్వారా వేధించి భయ పెట్టేందుకు అధికార పార్టీ నాయకులు పన్నాగం పన్నుతున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

### అందుబాటులోకి ఎన్‌బీఈజీ-776 రకం శనగ విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) మిషన్ కోతకు అనువైన శనగ రకాన్ని రైతులకు అందుబాటులోకి తెచ్చిందని కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ తెలిపారు. ఎన్‌బీఈజీ-776 రకం శనగ విత్తనాలు ఆర్ఏఆర్ఎస్‌లో సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రకం శనగ మిషన్ కోతకు అనువుగా ఉంటుందని, జేజీ-11 రకం కంటే బాగా వస్తుందని తెలిపారు. జేజీ-11కు ప్రత్యామ్నాయంగా ఈ విత్తనాలను ఆర్ఏఆర్ఎస్ అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. కిలో రూ.105 ప్రకారం రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### శ్రీశైలానికి తగ్గుతున్న వరద

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి రోజురోజుకి వరద ప్రవాహం తగ్గుతోంది. కృష్ణా, తుంగభద్రలలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వరద తగ్గింది. సోమవారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 13,490 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. ఆదివారం నుంచి సోమవారం వరకు ఎడమగట్టు కేంద్రంలో 7.481 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 4,642 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 34,846 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 186.8502 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 879.80 అడుగులకు చేరుకుంది.

# మాది రాజకీయ పాలన

- కూటమి నాయకులు చెప్పిన పనులన్నీ చేసి పెట్టాల్సిందే
- చేయలేకపోతే అధికారులు వివరణ ఇవ్వాలి
- మంత్రులు, ఎమ్మెల్యే సిఫారస్సులకు ప్రాధాన్యత తప్పనిసరి
- ఇది టీడీపీ ప్రభుత్వమని గుర్తుంచుకోండి
- జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు,చిత్రంలో మంత్రి టీజీ భరత్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు(సెంట్రల్): 'మాది పూర్తిగా పొలిటికల్ గవర్నెన్స్.. టీడీపీ, బీజేపీ, జనసేన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు చెప్పిన పనులు చేసిపెట్టాల్సిందే' అంటూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఇరిగేషన్ శాఖమంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. 'ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాదు.. అధికారులు తీరు మార్చు కోవాలి.. లేక పోతే చర్యలు తప్పవు' అంటూ హెచ్చరించారు. కూటమి నాయకులు చెప్పిన పనులు చేయలేకపోతే ఎందుకు చేయలేకపోతున్నారో తగు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి ప్రజా ప్రతినిధులు, నేతల సిఫారస్సులకు ప్రాధాన్యత ఇచ్చి పనులు వెంటనే ఇవ్వాలని జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో మంత్రి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎంపీ బి.నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్‌కుమార్, పార్థసారధి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, బి.విరుపాక్షి, బొగ్గుల దస్తగిరి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందు మాధవ్, జేసీ డాక్టర్ బి.నవ్య, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఇన్‌చార్జి మంత్రి అన్ని శాఖల పరంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం, ఇతర పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం సమీక్ష వివరాలు మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాదిలోగా హెచ్ఎన్ఎస్ఎస్‌ను విస్తరించి నీటి సామర్థ్యాన్ని 1,800 క్యూసెక్కుల నుంచి 3,850 క్యూసెక్కులకు పెంచనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రతిపాదనలు పంపితే రూ.2,500 కోట్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మరోవైపు ప్రాధాన్యత వారీగా వేదవతి, గుండ్రేవుల, నగరడోణ, ఆర్‌డీఎస్, గురురాఘవేంద్ర, గాజులదిన్నె, అలగనూరు ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు చేపడతామని వివరించారు. శాఖల వారీగా సమీక్షలో వచ్చిన అంశాలపై అధికారులు దృష్టి సారించాలని, చాలా మంది అధికారులు పనులను పట్టించుకోవడం లేదని, ఇలాగే వ్యవహరిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అధికారులను హెచ్చరించారు.

### వెనుకబడిన ఆలూరును అభివృద్ధి చేయండి - ఎమ్మెల్యే విరూపాక్షి

జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బి.వి రూపాక్షి జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో మంత్రి నిమ్మల, కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. నియోజకవర్గంలో రహదారులు దారుణంగా ఉన్నాయని, వాటిని బాగు చేయాలన్నారు. నగరడోణ రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని కోరారు. ఏబీసీ కాలువకు తుంగభద్ర నుంచి నీరు రాకపోవడంతో రైతుల పొలాలు బీళ్లుగా మారిపోయాయని, హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దేవనకొండ మండలంలో యురేనియం గుర్తింపు కోసం ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలన్నారు. మంత్రి నిమ్మలకు అవగాహన లేకుండా యురేనియం నెపాన్ని తమ పార్టీపై నెడుతున్నారని, 2017, 2024లో అధికారంలో ఎవరూ ఉన్నారు? బోర్ల తవ్వకాలకు ఎవరి కాలంలో అనుమతులు వచ్చాయో ప్రజలకు తెలుసునన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు,అధికారులు

### యురేనియం అంశంపై మంత్రికి అవగాహన ఏదీ..

కప్పట్రాళ్లలో యురేనియం అంశంపై మంత్రి నిమ్మల రామానాయుడుకు కనీసం అవగాహన లేనట్లుగా తెలుస్తోంది. యురేనియం గుర్తింపు, సర్వే, తవ్వకాలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది. 2017లో కప్పట్రాళ్ల యురేనియం నిక్షేపాల తవ్వకాలకు అనుమతి వచ్చింది. 2022లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వమే 68 బోర్లకు అనుమతులు వచ్చినట్లు సమీక్ష సమావేశంలో మంత్రి చెప్పడంతో అక్కడున్న అధికారులు నివ్వెరపోయారు. 'రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని అంశాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నెట్టడం ఏమిటని, అప్పుడు, ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి కదా అని కొందరు చర్చించుకున్నారు.

### అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితం

- ప్రభుత్వ వైఫల్యాలపై ఆదోని ఎమ్మెల్యే ధ్వజం

డీడీఆర్‌సీ సమావేశంలో ఆదోని ఎమ్మెల్యే ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు తప్ప అభివృద్ధి లేదని, ప్రభుత్వ వైఫల్యాలు ఎన్నో ఉన్నాయని, అధికారులు పనులు చేయడం లేదన్నారు. ఆదోని మార్కెట్ యార్డులో రైతులను వ్యాపారులు నిలువునా ముంచుతున్నా ఆదుకునే నాథుడే కరువయ్యారని, పైగా అధికారులు అక్రమాలకు వంత పాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యార్డులో జరుగుతున్న అక్రమాలు, రైతులు నష్టపోతున్న అంశాలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆదోని ఏరియా ఆసుపత్రిలో 30 మంది ఉండాల్సిన నర్సుల స్థానంలో కేవలం ముగ్గురే ఉన్నారన్నారు. నియోజకవర్గంలో లక్షల్లో పశువులు ఉన్నా ఒక్క ఆసుపత్రి లేదన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఆదోని నియోజకవర్గానికి కేవలం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారని, అదే పక్క నియోజకవర్గాలకు రూ.10 కోట్ల వరకు ఎలా నిధులు ఇస్తారని, తనకు అధికారులు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. కాగా ఈ విషయంలో మంత్రి నిమ్మల కలగజేసుకుని అన్ని శాఖలపై ఫిర్యాదు చేస్తే ఎలా.. సమస్యలు అక్కడి అధికారులతోనే పరిష్కరించుకోవాలని సూచించారు.

### అన్ని మీకేనా?

- కూటమి నాయకుల సమావేశంలో బయటపడిన అసంతృప్తి
- వాటాల్లో మాకు భాగమివ్వాలి కదా అని నిలదీతలు

కర్నూలు న్యూసిటీ: కూటమిలో వాటాల కుమ్ములాట మరోసారి బహిర్గతమైంది వాటాలు, వివిధ పోస్టుల పంపకాల విషయంలో నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. కలిసి పోటీచేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సమానంగా ఉండాలి, అలా కాకుండా బెల్లం ముక్కను ఒక్కరే కాజేస్తే మిగతా వాళ్ల పరిస్థితి ఏంటి.. మేము ఎప్పుడూ ఆర్థికంగా ఎదగాలని జనసేన నాయకులు ప్రశ్నించారు. ఈ అసంతృప్తి అంతా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలోనే బహిర్గతం కావడం విశేషం. సోమవారం నగరంలోని మౌర్యఇన్ సమావేశ మందిరంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కా రెడ్డి అధ్యక్షతన ఎన్‌డీఏ కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి కూటమి నాయకులు నియోజక వర్గాల వారీగా సమస్యలు వెల్లడించారు. ఇందులో ఆదోని నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. కూటమి అధికారంలోకి రావడానికి తాము ఎంతో కష్టపడ్డామని, ఇప్పుడు తమను ఎవరూ పట్టించుకోవడం ఆదోని జనసేన నాయకుడు మల్లప్ప ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఉచిత ఇసుకను తొలుకునే పరిస్థితి లేదన్నాడు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ... నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులకు కూడా అన్యాయం జరుగుతుందని, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు తమను మాట వరుసకు కూడా పిలవడం లేదని ఏకరువు పెట్టారు. దీనిపై ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి(బీజేపీ) మాట్లాడుతూ.. జనసేన, టీడీపీ నాయకులు తమకు అన్యాయం జరుగుతుందని వాటాల గురించి మాట్లాడుతున్నారు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులను పట్టించుకుంటున్నారా? అని నిలదీశారు. ఇదిలా ఉంటే కూటమి పార్టీలు నాయకులను వదులుకుంటారే కానీ పొత్తును వదులుకునేందుకు సిద్ధంగా లేవని మంత్రి నిమ్మల ఈ సందర్భంగా అన్నారు.

## సేవ్ మై విలేజ్... సేవ్ కప్పట్రాళ్ల ఫారెస్ట్



రోడ్లపై భారీగా ధర్నా చేస్తున్న గ్రామస్తులు



యురేనియం తవ్వకాలను ఆపకపోతే చావే శరణ్యమని మందు డబ్బా చూపిస్తున్న వృద్ధురాలు

- యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ రోడ్డెక్కిన పల్లెలు
- దాదాపు నాలుగు గంటల పాటు స్తంభించిన రాకపోకలు

దేవనకొండ: యురేనియం తవ్వకాలను తమ ప్రాంతంలో జరపరాదని దేవనకొండ మండలంలోని పలు గ్రామాలు ఆందోళన బాట పట్టాయి. సేవ్ మై విలేజ్... సేవ్ కప్పట్రాళ్ల ఫారెస్ట్ అంటూ నినదించాయి. దీంతో దాదాపు నాలుగు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే యురేనియం తవ్వకాలను ఆపాలని సోమవారం కప్పట్రాళ్ల, పి. కోటకొండ, బేతపల్లి, జిల్లెడబుడకల, మాచాపురం, గుండ్లకొండ, నెల్లిబండ తదితర 12 గ్రామాల ప్రజలు ఈదుల దేవరబండ వద్ద రహదారిపై చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దాదాపు నాలుగు గంటల పాటు అక్కడే బైఠాయించారు. రేడియోధార్మిక మూలకమైన యురేనియం మైనింగ్ జరిపితే తమ పొలాలు నిర్జీవమవుతాయని, ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు జరపమని సర్కారు స్పష్టమైన ప్రకటన చేయాలని, లేకపోతే విషం తాగి ప్రాణాలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో పాటు రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయిన విషయం తెలుసుకున్న పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, డీఎస్పీ వెంకటరామయ్య ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. తవ్వకాలకు ఇంకా అనుమతులు రాలేదని, దీనిపై త్వరలోనే కలెక్టర్ లిఖిత పూర్వకంగా హామీ ఇస్తారని చెప్పడంతో వారు శాంతించారు. ఆందోళన నేపథ్యంలో ముందుజాగ్రత్తగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నలుగురు సీఐలు, ఐదు మంది ఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లు అక్కడకు చేరుకుని బందోబస్తు నిర్వహించారు.

### శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పరిశీలన

రుద్రవరం: చిన్నకంబలూరు సమీపంలో పైర్లను నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రవికుమార్, గాయత్రి పరిశీలించారు. దాదాపు 50 మంది రైతులు జిల్లా కేంద్రంలో వరి విత్తనాలు కొనగోలు చేసి 900 ఎకరాల్లో సాగు చేశారు. అయితే పైరు సరిగా ఎదగకపోవడం, ఎదిగిన పైరు పొట్ట దశలోనే గిడసబారి పోవడం, మరికొంత తాలు గింజలుగా కావడంతో రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం వారు పైర్లను పరిశీలించి నమూనాలు సేకరించారు. పరీక్షించి నివేదికను వ్యసాయాధికారులకు అందజేస్తామన్నారు.

### మార్కెట్‌కు తగ్గిన ఉల్లి తాకిడి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి తాకిడి తగ్గింది. సోమవారం మార్కెట్‌కు 441 మంది రైతులు 10,687 క్వింటాళ్లు తీసుకొచ్చారు. అక్టోబరు 20 నుంచి మార్కెట్‌కు ఉల్లి తాకిడి ఎక్కువగా ఉంది. ఒకదశలో రికార్డు స్థాయిలో 25 వేల క్వింటాళ్లు వచ్చింది. ఈ నెల 1 నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు లేవు. నాలుగు రోజుల తర్వాత సోమవారం మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరిగాయి. గత వారంతో పోలిస్తే 50 శాతం పైగా ఉల్లి తగ్గింది. కనిష్టంగా రూ.522, గరిష్ట ధర రూ.4,439 లభించింది. సగటు ధర రూ.3,669గా నమోదైంది. ఉల్లి తాకిడి తగ్గడంతో వచ్చిన సరుకు మొత్తానికి టెండరు వేశారు. మార్కెట్‌కు వేరుశనగ, ఆముదాలు కూడా వచ్చాయి. వేరుశనగ ధర నిరాశజనకంగా మారింది. కనిష్టంగా రూ.2,727, గరిష్టంగా రూ.7,119 లభించింది. మోడల్ ధర 4,459 మాత్రమే నమోదైంది. ఎక్కువ మంది రైతులకు రూ.4,000 నుంచి రూ.4,500 వరకు మాత్రమే లభించింది. మార్కెట్‌కు ఆముదాలు 2,538 క్వింటాళ్లు వచ్చాయి. కనిష్ట ధర రూ.4,455, గరిష్ట ధర రూ.5,859 లభించింది. సగటు ధర రూ.5,774గా నమోదైంది.

## ఉద్యోగం పేరుతో మోసం చేశారు!

- పలువురు ఎస్పీకి ఫిర్యాదు



సమస్యలు వింటున్న ఎస్పీ

కర్నూలు (టౌన్): సివిల్ సప్లయ్‌లో సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి వెల్దుర్తికి చెందిన ప్రశాంత్ బాబు అనే వ్యక్తి తన వద్ద రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని నగరంలోని శ్రీరామ నగర్‌కు చెందిన అరుణ దేవి, తన తమ్ముళ్లకు అటెండర్, వాచ్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు నగరానికి చెందిన శారదమ్మ అనే మహిళ రూ.5.50 లక్షలు తీసుకుని మోసం చేసిందని స్థానిక బుధవారపేటకు చెందిన వాణి పుష్పలత ఎస్పీకి వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. సోమవారం కొత్తపేటలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్పీ బిందుమాధవ్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 88 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

**ఫిర్యాదుల్లో కొన్ని...**

- ఎస్‌బీఐ యోనో బ్యాంకు రివార్డ్ పాయింట్స్ పెంచుతామని చెప్పి నా ఫోన్‌కు లింక్ పంపించారు. నేను నమ్మి ఆ లింక్‌ను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలోని రూ.47,856 మాయమైపోయాయని, న్యాయం చేయాలని నగరంలోని వాసవీ నగర్‌కు చెందిన మోహన్ అనే వ్యక్తి కోరాడు.
- పెద్దల ఆస్తిలో భాగంగా వచ్చిన రస్తా విషయంలో కోర్టు తీర్పు వచ్చినా తనను శ్రీనివాసులు అనే వ్యక్తి బెదిరింపులకు గురిచేస్తున్నాడని కర్నూలు కొత్తపేటకు చెందిన రామకృష్ణ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- తన జీవనాధారం కోసం ఉన్న పొలాన్ని రాసివ్వాలని కుమారుడు రవి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కోడుమూరుకు చెందిన చంద్రశేఖర్ ఎస్పీ ఎదుట వాపోయాడు.

## నేటి నుంచి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

- జెడ్పీ సీఈఓ, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ జి. నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక ( 2025-26 ) రూపకల్పనకు సంబంధించి జిల్లా స్థాయిలో ఈ నెల 5వ తేది నుంచి 8వ తేది వరకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నట్లు డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు జిల్లాలోని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, ప్రతి మండలం నుంచి ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ హాజరు కావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ తీసుకున్న వారు ఈ నెల 12 నుంచి 16వ తేది వరకు మండలాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, మండల స్థాయి లైన్ డిపార్టుమెంట్ అధికారులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ ద్వారా క్షేత్ర స్థాయి వరకు సరైన అవగాహన లభిస్తేనే రానున్న సంవత్సరపు ప్రణాళిక సక్రమంగా తయారు చేసి అమలు చేసేందుకు వీలవుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్లాన్ తయారీ, అమలు, ఆడిట్‌ల ప్రాధాన్యత పరంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణను పూర్తి స్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ శిక్షణ సంస్థకు చెందిన అధికారులు పరిశీలకులుగా హాజరు కానున్నారన్నారు. ముఖ్యంగా గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థాయిలోని పంచాయతీల ద్వారా పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన నిధుల విడుదలలో సమస్యలు రాకుండా చూసుకునే విధంగా అవగాహన కల్పిస్తారన్నారు.



దశ విధ హారతులు ఇస్తున్న అర్చకులు



పుష్కరిణి వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

## హర హర.. మహాదేవా!



- భక్తులతో కిటకిటలాడిన శ్రీగిరి
- పాతాళగంగలో పుణ్య స్నానాలాచరించి, మల్లన్నను దర్శించుకున్న భక్తులు
- నేత్రానంద భరితంగా లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి



దీపోత్సవ కాంతులతో శ్రీశైల క్షేత్రం

శ్రీశైలంటెంపుల్: హర హర మహాదేవా.. శంభో శంకర నామస్మరణతో శ్రీగిరి క్షేత్రం మారుమోగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు వేకువజాము నుంచే భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులు తీరారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర(శివ)మాడవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన దీపారాధనలో పలువురు భక్తులు దీపాలు వెలిగించుకుని పూజలు నిర్వహించుకున్నారు. కొంతమంది భక్తులు లక్ష ఒత్తులు వెలిగించి నోములు నోచుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. వేకువజామున ఆలయ ద్వారాలను తెరిచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులందరికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు స్వామిఅమ్మవార్ల అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం కల్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు బిస్కెట్లు, అల్పాహారం అందించారు.



మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

### నేత్రానందభరితంగా లక్షదీపోత్సవం

కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని లోకకల్యాణం కోసం పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతిని నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చి అర్చకులు, వేదపండితులు విశేషంగా పూజాదికాలు నిర్వహించారు.పుష్కరిణి ప్రాంగణంలో లక్ష దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను ఇచ్చారు. ఓంకార హారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతిలను ఉభయ ఆలయాల ప్రధాన అర్చకులు వీరన్నస్వామి, మార్కండేయశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## క్లుప్తంగా

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం



వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ విష్ణునారాయణ తెలిపిన వివరాలు.. 35 ఏళ్ల వయస్సు ఉన్న యువకుడి మృతదేహం ఉందని స్థానికుల నుంచి సమాచారం అందడంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. మత్స్యకారుల సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



నాగలక్ష్మి(ఫైల్)

బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామానికి చెందిన నాగలక్ష్మి(48) ఇంటిపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కంచబోయిన కాశమయ్య, నాగలక్ష్మి దంపతులకు కుమారుడు, పెళ్లి అయిన కూతురు ఉన్నారు. సోమవారం నాగలక్ష్మి ఇంటిపై విగతజీవిగా పడి ఉండటం గమనించి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని కుమారుడు దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### తొమ్మిది టన్నుల కూరగాయల విరాళం



కూరగాయలు అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు చిక్‌బళ్లాపూర్‌కు చెందిన ఏపీఎంసీ మర్చంట్స్ భాస్కర్, మల్లికార్జున, శివపావని సోమవారం ఆలయ పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. రూ.2లక్షల విలువ చేసే 18 రకాల కూరగాయలు అందజేసినట్లు దాతలు తెలిపారు.

# ఇలా 'ఐ'తే.. చూపు మాయం

- మొబైల్‌తో చిన్నారులకు మరీ డేంజర్
- పిల్లలపై బ్లూరేస్ ప్రభావం
- చిన్న తనంలోనే దృష్టి లోపాలు
- 30 శాతం మంది పిల్లలకు కంటిచూపు సమస్య

ఒకప్పుడు పుస్తకం హస్తభూషణంగా ఉండేది. కానీ ఇప్పుడు మొబైల్ ఫోన్ హస్తభూషణం అయ్యికూర్చుంది. పెద్దల నుంచి చిన్నపిల్లల వరకు ఇప్పుడు మొబైల్ లేని వారు కనిపించని పరిస్థితి. ఖాళీ సమయం దొరికితే చాలు మొబైల్ చేతిలో ఉండాల్సిందే. సోషల్ మీడియాలో రీల్స్ చూస్తూ అధిక శాతం గడిపేస్తున్నారు. చిన్నపిల్లల్లో ఈ వైపరీత్యం మరీ ఎక్కువైంది. పగలూ రాత్రి తేడా లేకుండా మొబైల్‌కు బానిసలయ్యారు. దీనివల్ల చిన్నతనంలోనే దృష్టి లోపాలతో పాటు పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు కంటి అద్దాలు పెట్టుకుంటే వీడికి నాలుగు కళ్లు వచ్చాయిరా అని ఎగతాళి చేసేవారు. దృష్టి లోపం వచ్చిందంటే అదో పెద్ద సమస్యగా చూసేవారు. అది ఇప్పుడు సాధారణమైపోయింది. పాఠశాల నుంచి ప్రొఫెషనల్ కాలేజీల్లోని విద్యార్థుల వరకు అధిక శాతం పిల్లలు ఇప్పుడు కంటి అద్దాలు ధరించి చదవాల్సి వస్తోంది. చిన్నతనంలోనే ఆరోగ్య సమస్యలు గుర్తించి వారికి వైద్యమందిస్తే పెద్దయ్యాక దుష్ప్రభావాలు కనిపించవనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో చిన్నారులకు పాఠశాల స్థాయిలోనే కంటి పరీక్షలు నిర్వహించారు. గత మార్చి వరకు జిల్లాలోని 4,351 పాఠశాలల్లో ఉన్న 6,73,728 మంది 5 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 37,329 మందికి దృష్టిలోపం ఉందని నిర్ధారించి 14,525 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 20 మంది చిన్నారులకు కాటరాక్టు ఉన్నట్లు నిర్ధారించి శస్త్రచికిత్స చేశారు. మరో 148 మందికి ఇతర కంటి సమస్యలు ఉండటంతో ఆపరేషన్లు చేశారు.

**కంటి చూపును తినేస్తున్న బ్లూరేస్**

మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌ల నుంచి వెలువడే బ్లూ రేస్ (అతినీలలోహిత కిరణాలు) కంటి చూపును దెబ్బ తీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు తదేకంగా గంటల కొద్దీ మొబైల్ ఫోన్‌లు, ట్యాబ్‌లు చూడటం వల్ల దృష్టి లోపాలు పెరుగుతున్నాయి. వీటిలోని బ్లూ రేస్ నేరుగా కంటిపై పడటం వల్ల మయోపియా అనే దృష్టిలోప సమస్య వస్తుంది. దీనివల్ల కంటిచూపు తగ్గడం, తలనొప్పి లక్షణాలు అధికమవుతాయి. అలాగే డ్రై ఐస్ (కళ్లల్లో నీరు ఎండిపోవడం) వంటి సమస్య వస్తుంది. దీనివల్ల కళ్లు ఎర్రగా కావడం, ఒత్తుకున్నట్లు ఉండటం వంటి ఇబ్బందులు ఉంటాయి. దీన్ని అలాగే వదిలేస్తే నల్లగుడ్డుపై తెల్లమచ్చలు వస్తాయి. మరికొందరు చిన్నారుల్లో మందబుద్ధి, ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడకపోవడం, చిన్నపిల్లలతై త్వరగా మాటలు రాకపోవడం వంటి సమస్యలూ వస్తున్నాయి.




విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ (ఫైల్)

**చిన్నారుల్లో దృష్టిలోపాల లక్షణాలు**

దగ్గరగా, దూరంగా ఉన్న వస్తువులను సరిగ్గా చూడలేకపోవడం, అస్పష్టమైన చూపు, చదవడంలో పిల్లలకు ఆసక్తి లేకపోవడం వంటి లక్షణాలు పిల్లల్లో కనిపిస్తాయి.

**దృష్టిలోపానికి కారణాలు**

పిల్లల్లో ఏ విటమిన్ లోపం వల్ల రేచీకటి, గ్లకోమా, జీరాప్తాల్మియా వంటి కంటి వ్యాధులు వస్తాయి. కొంతమందికి జన్యుపరమైన కారణాలు, మేనరికపు వివాహాలు, గర్భిణిగా ఉన్నప్పుడు తల్లి తీసుకునే కొన్ని రకాలైన మందుల వల్ల పుట్టుకతో కంటి జబ్బులు వస్తాయి. మేనరికం వల్ల రెటినైటిస్ పిగ్మెంటోజా, ఆర్‌పీపీ అనే కంటి జబ్బులు ప్రీమెచ్యూర్ పిల్లల్లో వస్తున్నాయి.



**కంటి విషయంలో జాగ్రత్తలు**

- పుస్తకాలను కంటికి అడుగున్నర దూరంలో, తగినంత వెలుతురులోనే చదవాలి.
- దుమ్ము, పొగ, ప్రకాశవంతమైన కాంతిని నేరుగా చూడకూడదు.
- కంటికి సుర్మా, కాటుక వంటివి వాడకూడదు.
- చదివే సమయంలో, కంప్యూటర్, సెల్‌ఫోన్, ట్యాబ్ చూస్తున్నప్పుడు కంటికి ప్రతి 15 నిమిషాలకు ఒకసారి విధిగా విరామం ఇవ్వాలి. దృష్టిలోపం ఉంటే కళ్లజోడు వాడటం తప్పనిసరి.

### పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి



ఇటీవల కాలంలో చిన్నారులు మొబైల్ ఫోన్లకు అడిక్ట్ అయ్యారు. పాఠశాల నుంచి రాగానే మొబైల్ పట్టుకుని గంటల తరబడి చూడటం పరిపాటిగా మారింది. కొంత మంది అర్ధరాత్రి వరకు మేల్కొని సెల్‌ఫోన్ చూస్తూ గడుపుతున్నారు. ఇలాంటి పిల్లల్లో కంటి సమస్యలతో పాటు ఊబకాయం, చురుకుదనం లోపించడం, ఇతరులతో సరిగ్గా మాట్లాడలేకపోవడం, మెడ, వెన్నుముక సమస్యలు, చదువుల్లో వెనుకబడిపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి పిల్లలకు నయానో, భయానో మొబైల్ చూడటం మాన్పించి వ్యాపకాల వైపు దృష్టి మళ్లించాలి. అప్పుడే చురుగ్గా, ఆరోగ్యంగా ఉంటారు.

– డాక్టర్ కె.సింధూర, చిన్నపిల్లల వైద్యురాలు, కర్నూలు

### మయోపియా బాధితులు ఎక్కువయ్యారు



మొబైల్‌ను తదేకంగా ఎక్కువసేపు చూడటం వల్ల దృష్టిలోపం అధికమవుతోంది. దీనినే వైద్య పరిభాషలో మయోపియా అంటారు. ఈ సమస్యతో చాలా మంది చికిత్స కోసం వస్తున్నారు. పిల్లలకు చికిత్సతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నాం. ఎక్కువసేపు మొబైల్ స్క్రీన్‌ను చూడటం వల్ల దృష్టిలోపంతో పాటు కళ్లు డ్రైగా మారడం, కళ్ల మంటలు, దురద సమస్యలుంటాయి. పెద్దవారు మొబైల్ స్క్రీన్‌ను ఎక్కువసేపు చూడాల్సి వస్తే బ్లూకట్ గ్లాసెస్ వాడాలి.

–డాక్టర్ జె.జె.ప్రవీణ్, కంటి వైద్యనిపుణులు, కర్నూలు

### దూర విద్య పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

కర్నూలు సిటీ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్య పరీక్షలు జరుగుతున్నాయి. జిల్లాలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్సిటీ నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలన బృందం సోమవారం కర్నూలు నగరంలోని మూడు కేంద్రాలను, గూడూరులోని ఒక కేంద్రాన్ని తనిఖీ చేసింది. కాగా గూడురులోని పరీక్ష కేంద్రంలో కొంత మంది దగ్గర చీటీలు పట్టుబడినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ పరీక్ష కేంద్రాన్ని రద్దు చేసి కర్నూలు నగరంలోని కేంద్రాల్లో విద్యార్థులను పరీక్షలు రాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### బైక్ ఢీకొని మహిళ మృతి

డోన్ టౌన్: బైక్ ఢీకొట్టడంతో సోమవారం ఓ మహిళ మృతిచెందింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన మాల లక్ష్మిదేవి(54) ఉదయం చిగురుమానుపేట సమీపంలోని కట్టెల డిపో వద్ద రోడ్డు దాటుతుండగా బోయ మధు అనే యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. తీవ్రగాయాల పాలైన మహిళను చికిత్స నిమ్మిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు గతంలోనే మృతి చెందగా అల్లుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఐసీడీఎస్ చెంతకు చిన్నారి

డోన్ టౌన్: తల్లి హత్యకు గురై, తండ్రి జైలుకు వెళ్లడంతో ఒంటరిదైన ఐదు నెలల పసి పాప సృజనను పట్టణ పోలీసులు ఐసీడీఎస్ అధికారులకు సోమవారం అప్పజెప్పారు. గత నెల 30న తండ్రి రవీంద్ర చేతిలో తల్లి శాంతమ్మ దారుణ హత్యకు గురైన విషయం పాఠకులకు విదితమే. పోలీసుల దర్యాప్తులో భర్త రవీంద్ర హంతకుడిగా తేలడంతో అతడిని ఆదివారం అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి సృజనను కర్నూలు శిశు సంరక్షణ కేంద్రానికి తరలించాలని సీఐ ఇంతయాజ్‌బాషా ఆదేశాల మేరకు ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగంకు అప్పజెప్పారు.

### 6,000 ఎకరాల్లో శనగ విత్తనోత్పత్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీసీడ్స్ 2024-25 సంవత్సరానికి సంబంధించి శనగ విత్తనోత్పత్తి చేపట్టింది. రబీలో 6000 ఎకరాల్లో విత్తనోత్పత్తి చేసే విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చింది. ఏపీ సీడ్స్ అధికారులు విత్తనోత్పత్తి పట్ల ఆసక్తి ఉన్న రైతులను గుర్తిస్తోంది. ఇప్పటి వరకు 500 ఎకరాలకు విత్తనోత్పత్తికి అవసరమైన శనగ విత్తనాలను ఏపీసీడ్స్ సరఫరా చేసింది. జేజీ-11 రకం ఫౌండేషన్ శనగ విత్తనాలను పూర్తి ధరపై రైతులకు అందజేస్తారు. పూర్తి ధర క్వింటాలుకు రూ.9,600 చెల్లించాల్సి ఉంటుంది. ఉత్పత్తి అయిన శనగలను 2025-26 రబీ సీజన్ కోసం ఏపీ సీడ్స్ సేకరిస్తుంది. సీడ్ ఉత్పత్తి పట్ల ఆసక్తి ఉన్న రైతులు ఏపీ సీడ్స్ అధికారులను లేదా సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించ వచ్చని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు.

## ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రజాసమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..కొంతమంది అధికారులు సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో అర్జీలు రీఓపెన్ అవుతున్నాయన్నారు. కొన్ని శాఖల అధికారులు సంబంధంలేని అంశాలను అప్‌లోడ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు అంశాలను అప్‌లోడ్ చేసిన వెల్దుర్తి ఈఓపీఆర్‌డీపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, కర్నూలు ప్లానింగ్ విభాగపు అధికారులకు కూడా నోటీసులు ఇవ్వాలన్నారు. ఎండార్స్‌మెంట్, విచారణ నివేదికలను అప్‌లోడ్ చేయడంపై అధికారులకు సరైన అవగాహన లేని కారణంగా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీఆర్వోను ఆదేశించారు. మరో వైపు సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులకు సరైన పరిష్కారాలు చూపాలన్నారు. ఈవారంలో మొత్తం 20 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, నాగప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

- నా కుమారుడిని వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని, వారి బారి నుంచి కాపాడాలని అమ్మ హాస్పిటల్ ఏరియాకు చెందిన హుస్సేన్‌బీ విన్నవించారు.
- కర్నూలు నగరంలోని 127వ వార్డు పరిధి బాలాజీ నగర్, బృందావనం కాలనీల్లో వీధిలైట్లు వెలగడంలేదని, తాగునీటికి ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు మద్దిలేటి, కృష్ణ, శ్రీరాములు, శంకరరాజు, నగేష్ విన్నవించారు.
- చెన్నై - సూరత్ జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు ఇచ్చినా తమకు సరైన పరిహారం ఇవ్వడంలేదని ఆర్ కొంతలపాడుకు చెందిన చిలకరత్నం, రంగారెడ్డి, తిరుపాలు కలెక్టర్‌కు విన్నవించారు.
- అర్హులైన వీఆర్‌ఏలకు అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించాలని, తహసీల్దార్ కార్యాలయాలకు కాపాలగా ఉండే నైట్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు కలెక్టర్‌కు విన్నవించారు.

## సార్ నష్టపోతున్నాం.. ఆదుకోండి

- మంత్రులు నిమ్మల, టీజీ భరత్‌కు గోడు వెళ్లబోసుకున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్యటించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు ఉల్లి రైతులు తమగోడును వినిపించారు. ఉల్లిలో పెట్టుబడి వ్యయం పెరిగిపోయిందని, ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ధరలు గిట్టుబాటు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్ అయి ధరలు పెరుగకుండా చేస్తున్నారని వాపోయారు. ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు. సోమవారం కర్నూలుకు వచ్చిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల, పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి టీజీ భరత్‌తో కలసి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మంత్రి మాట్లాడుతూ.. ఉల్లి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇటు రైతులు, అటు వినియోగదారులకు మేలు జరిగే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది అక్టోబరు నెలలో 52 వేల క్వింటాళ్ల ఉల్లి వచ్చిందని, ఈ సారి 2.25 లక్షల క్వింటాళ్ల ఉల్లి వచ్చిందని తెలిపారు. ఉల్లి భారీగా రావడం, ఈ-నామ్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడటం, టెండర్లలో జాప్యం జరుగడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. కర్నూలు మార్కెట్‌పై వత్తిడి తగ్గించేందుకు కోడుమూరులో ఉల్లి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. వ్యాపారులు సిండికేట్ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కమిటీ అధికారులను ఆదేశించారు. ఉల్లి రైతులు దళారీల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. మంత్రుల వెంట ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ రంజిత్ బాష, జేసీ నవ్య, కర్నూలు ఆర్‌డీవో సందీప్ కుమార్, ఏడీఎం నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా మంత్రులు హడావుడిగా వచ్చి..పైపైన రైతులతో మాట్లాడి వెళ్లిపోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, చిత్రంలో మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ తదితరులు



### పేదింట విద్యా కుసుమాలు

- టెట్‌లో ఇద్దరు జిల్లా వాసులకు 150కి 150 మార్కులు



వడ్ల మంజుల



క్రాంతికుమార్

కొలిమిగుండ్ల/అవుకు: పేదింట విద్యా కుసుమాలు విరబూశాయి. సోమవారం వెలువడిన టెట్ ఫలితాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు 150కి 150 మార్కులు సాధించి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టారు. అక్టోబర్ 3 నుంచి 21వ తేదీ వరకు ప్రభుత్వం టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)నిర్వహించారు. కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లెకు గ్రామానికి చెందిన వడ్ల కొండయ్య, వరలక్ష్మి దంపతులు కూలీ పనులు చేస్తూ కూతురు మంజులను చదివిస్తున్నారు. అనంతపురంలో మంజుల టీటీసీ పూర్తి చేసి అక్కడే కోచింగ్ తీసుకుంది. టెట్ ఫలితాల్లో 150 మార్కులు సాధించింది. అలాగే అవుకు మండలం నిచ్చెనమెట్ల గ్రామానికి చెందిన తలారి క్రాంతికుమార్ తల్లిదండ్రులు కూడా వ్యవసాయ కూలీలే. సోమవారం విడుదలైన ఫలితాల్లో క్రాంతికుమార్ 150 మార్కులు సాధించాడు. టీచర్ ఉద్యోగం సాధించి పేద విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన చేయడమే తమ లక్ష్యమని మంజుల, క్రాంతికుమార్ తెలిపారు.

## క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండు

నంద్యాల(న్యూటౌన్): క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్ఆర్‌ఐ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. రెండు రోజులుగా పద్మావతినగర్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అండర్-17 ఎస్‌జీఎఫ్ బాల, బాలికల టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి క్రీడలు సోమవారంతో ముగిశాయి. ఎస్ఆర్‌ఐ సురేంద్రనాథ్‌రెడ్డితోపాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టేబుల్ టెన్నిస్ రాష్ట్ర పరిశీలకులు శ్రావణ్ కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ క్రీడలకు సమయం కేటాయించుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ కోచ్ ముంతాజ్ బేగం, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏపీ రెడ్డి, జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, దండే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న సురేంద్రనాథరెడ్డి

### మృతుడు గోర్లగుట్ట వాసి

పాణ్యం: మండల కేంద్రంలోని ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి బేతంచెర్ల మండలం గోర్లగుట్ట గ్రామానికి చెందిన విజయ్‌కుమార్(45)గా గుర్తించామని ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాంగ్‌రూట్‌లో రావడంతో ఎదురుగా వస్తున్న తుఫాన్ ఢీకొనడంతో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఘటనా స్థలంలో లభ్యమైన బైక్ నంబర్ ఆధారంగా మృతుడిని గురించామన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి గర్జప్పతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బోయ తలారి గర్జప్ప అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) కబడ్డీలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాల హెచ్‌ఎం ఇందిరాదేవి, పీఈటీ జి.రామన్న ఆ విద్యార్థిని అభినందించి మాట్లాడారు. అక్టోబర్ 27వ తేదీన అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయస్థాయికి ఎంపిక అయ్యారన్నారు. ఈ పోటీలు ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నర్సంగపూర్‌లో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు రమణమూర్తి, ఉపాధ్యాయేతర సిబ్బంది నవీన్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

**అథ్లెటిక్స్‌లో..**



కోచ్‌తో మల్లికార్జున

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన కోసిగి రమేష్ కుమారుడు మల్లికార్జున అథ్లెటిక్స్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఆదోనిలో ఇంటర్ ఎంఎల్‌టీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఈ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ఈనెల 2వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించి 5 కిలో మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నేపథ్యంలో ఈనెల 24 నుంచి 30వ తేది వరకు లక్నోలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నట్లు కోచ్ తెలిపారు.



### నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: చోరీలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను సోమవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన వడ్డే సుబ్బరాయుడు 1997 నుంచి చోరీలే వృత్తిగా ఎంచుకున్నాడు. గడివేముల-2, నంద్యాల తాలుకా-3, నందివర్గం-1, డోన్ -1 చొప్పున కేసులు నమోదయ్యాయి. గడివేములో నమోదైన 2 కేసుల్లో ఒకటి హత్యాయత్నం కేసు. మిగిలిన 6 కేసులు చోరీలకు సంబంధించినవే. నిందితుడిని దుర్వేశి క్రాస్ రోడ్డులో ఆటో ఎక్కుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలు చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

## బరి తెగించిన టీడీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌పై దౌర్జన్యం
- అడ్డు వచ్చిన అత్తపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు
- పరామర్శించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మేయర్, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కూడా కాలేదు. అధికార టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారు. తాజాగా కర్నూలు నగరంలో 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేసి ఆమె అత్తపై దాడి చేశారు. సీ క్యాంప్‌లోని మునిసిపల్ స్కూల్ బాత్‌రూంల వద్ద అక్రమంగా బంకులు ఏర్పాటు చేశారు. దీని వల్ల స్కూల్‌లో చదివే బాలికలకు, మహిళా ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని ఆ వార్డు కార్పొరేటర్ ఇటీవల జరిగిన నగరపాలక సర్వసభ్య సమావేశంలో మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆగ్రహించిన అదే వార్డుకు చెందిన మంత్రి అనుచరుడు మాజీ కార్పొరేటర్ గున్నామార్కు తమ్ముడు దాసు సోమవారం శ్రీరామనగర్‌లోని కార్పొరేటర్ పల్లవి ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కటారి సురేష్‌కుమార్ లేకపోవడంతో ఇంట్లోని మహిళలతో గొడవకు దిగాడు. బూతులు తిడుతూ పల్లవిపై దౌర్జన్యం చేస్తుండగా అడ్డువచ్చిన ఆమె అత్త సత్యవేదమ్మపై చేయిచేసుకున్నాడు. దీంతో భయాందోళనకు గురైన ఆమె సొమ్మసిల్లి పడిపోయింది.వెంటనే కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత జరిగిన ఘటనపై మూడోపట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.



కార్పొరేటర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి, బీవై రామయ్య, కార్పొరేటర్లు

**పరామర్శించిన పార్టీ నాయకులు**

కార్పొరేటర్ కటారి పల్లవి ఇంటిపై దౌర్జన్యం, దాడి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ సింహారెడ్డి, జుబేర్, యూనుసుబాషా, కార్పొరేటర్లు సిట్రా సత్యనారాయణమ్మ, షాషావలీ, షేక్ అహమ్మద్ సోమవారం సాయంత్రం బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ 75 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధురాలిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి అండ చూసుకునే టీడీపీ మాజీ కార్పొరేటర్ గున్నామార్కు, ఆయన సోదరుడు, అనుచరులు రెచ్చిపోతున్నారన్నారు. ప్రజా సమస్యలను కార్పొరేటర్ ప్రశ్నిస్తే దాడి చేస్తారా.. ఇదేనా రెడ్ బుక్ రాజ్యాంగం అని ప్రశ్నించారు. కర్నూలు కార్పొరేషన్‌లో గతంలో ఎప్పుడూ ఇటువంటి సంఘటనలు జరగలేదన్నారు. కార్పొరేటర్ కుటుంబ సభ్యులపై దాడి విషయాన్ని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.